MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
GHMC hmda TS-bPASS
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout's, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers, Opp: GHMC Circle Office, Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595


# క్రైమ్ మిర్రర్ ®

Voice of Anti Corruption

## తెలంగాణ జిల్లాలు

సోమవారం 4-05-2026 పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్







## తాలుపేరుతో కోతలు..
# ధాన్యం అమ్ముకోలేక రైతుల అవస్థలు!

తాలు ఉందంటూ బస్తాకు కిలో నుంచి రెండు కిలోల వరకు కటింగ్

షార్టేజ్ పేరుతో అదనంగా లారీకి 5 నుంచి 10 క్వింటాళ్ల కోత

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా అన్నదాతల అరిగోస

ఆరుగాలం కష్టపడ్డ రైతులకు ధాన్యం అమ్ముకునే సమయంలోనూ అవస్థలు తప్పడం లేదు. తాలు పేరుతో మిల్లర్లు నిండా ముంచే ప్రయత్నం చేస్తున్నారు. పరిమితికి మించి తాలు ఉందంటూ బస్తాకు కేజీ నుంచి రెండు కేజీల వరకు కోతపెడుతున్నారు. ఏఈవోలు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం తూర్పార బట్టించినా కూడా, మిల్లు దగ్గరికి వెళ్లిన తర్వాత కోత పెట్టడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలు చోట్ల రోడ్ల మీద బైఠాయించి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## మంథని నియోజకవర్గంలో
# అభివృద్ధికి బూస్ట్

- రూ. 15 కోట్లతో 300 మౌలిక సదుపాయాల పనులకు గ్రీన్ సిగ్నల్
- డబుల్ ఫండింగ్‌కు చెక్ పెట్టాలని అధికారులకు ఆదేశం
- మంత్రి శ్రీధర్ బాబుకు ప్రత్యేక ధన్యవాదములు : విలాస్ రావు

# ఈదురుగాలులతో భారీ వర్షాల హెచ్చరిక

- ఎండలకు ఉపశమనం..పంటలకు ముప్పు
- కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రక్షణపై ఆందోళన
- రైతులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచన



# ఐకెపి కేంద్రాల్లో మందగించిన కొనుగోళ్లు

- ప్రభుత్వ నిర్లక్ష్యంపై మండిపడ్డ కిరణ్
- వర్షం పడితే రైతు నాశనం.. బాధ్యత ఎవరిది?
- వడ్ల కొనుగోళ్లు వేగవంతం చేయాలి : గోల్కొండ కిరణ్

క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి

అకాల వర్షాల ముప్పు నేపథ్యంలో ఐకెపి కొనుగోలు కేంద్రాల్లో వడ్ల కొనుగోళ్లను వెంటనే వేగవంతం చేయాలని టిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గోల్కొండ కిరణ్ డిమాండ్ చేశారు. రైతుల పంటలు వర్షాలకు తడిసి నష్టపోకుండా ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

### వర్షాల భయం -- రైతుల్లో ఆందోళన

ప్రస్తుతం వాతావరణ మార్పులతో ఎప్పుడైనా అకాల వర్షాలు కురిసే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పంట కోసిన రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చినా, కొనుగోలు ప్రక్రియ మందగించడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

### కొనుగోళ్ల వేగం పెంచాలి..

ఈ నేపథ్యంలో ఐకెపి కేంద్రాల్లో నిల్వ ఉన్న వడ్లను ఆలస్యం చేయకుండా తక్షణమే కొనుగోలు చేయాలని గోల్కొండ కిరణ్ స్పష్టం చేశారు. అధికారులు నిర్లక్ష్యం చేయకుండా రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

### ప్రభుత్వం తక్షణ స్పందన అవసరం

రైతుల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని గోల్కొండ కిరణ్ విజ్ఞప్తి చేశారు. లేదంటే రైతులు భారీ నష్టాలు చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.



# తాలు పేరుతో కోతలు.. ధాన్యం అమ్ముకోలేక రైతుల అవస్థలు!

**క్రైమ్ మిర్రర్(నల్లగొండ బ్యూరో):** అన్నదాతల పరిస్థితి రోజు రోజుకు అగమ్య గోచరంగా మారుతోంది. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని చిరికి అమ్ముకోలేక అవస్థలు పడుతున్నారు. ఏదో ఒక సాకు చూపించి రైతులను నిండా ముంచే ప్రయత్నం చేస్తున్నారు మిల్లర్లు. గత సీజన్ లో తేమ పేరుతో కొర్రీలు పెట్టగా, ఈసారి తాలు పేరుతో ధాన్యంలో అడ్డగోలుగా కోతలు పెడుతున్నారు. ధాన్యం పండించేందుకు అరిగోస తప్పలేదు, ఇప్పుడు అమ్మకోవడంలో కూడా అష్టకష్టాలు పడాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ధాన్యంలో తాలు లేకపోయినా కోతలు పెడుతున్న మిల్లర్లు

ఈ సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అయినప్పటి నుంచి ఎండలు విపరీతంగా కొడుతున్నాయి. రెండు రోజుల్లోనే ధాన్యం పూర్తిగా ఎండుతోంది. నిర్ణీత తేమశాతం 17 వరకు ఉండవచ్చని నిర్ణయించినా, నూటికి 90 శాతానికి పైగా రైతుల ధాన్యం 15 లోపే వస్తోంది. అయితే, ఈసారి కొత్తగా తాలు పేరుతో రైతులను ముంచే ప్రయత్నం మొదలు పెట్టారు. ముందుగానే ఏఈవోలు ధాన్యం కోనుగోలు కేంద్రాల్లో తాలును శుభ్రం చేయించినా, ధాన్యం మిల్లు దగ్గరికి వెళ్లిన తర్వాత మళ్లీ తాలు ఉందంటూ అడ్డగోలుగా కోతలు పెడుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కొన్ని చోట్ల ధాన్యం దిగుమతి చేసుకోకుండా మళ్లీ వెనక్కి పంపిన ఘటనలు ఉన్నాయి. ఆశ్చర్యకర విషయం ఏంటంటే.. నల్లగొండ జిల్లా కనగల్లు మండల పరిధిలోని ఓ కొనుగోలు కేంద్రం నుంచి వెళ్లిన ధాన్యం లారీకి 6 క్వింటాళ్లు కోతపెడతామని చెప్పడంతో రైతులు ఒప్పుకోలేదు. చివరకు వెనక్కి పంపించారు. మళ్లీ శుభ్రం చేసుకుని తీసుకెళ్లాక ఏకంగా 9 క్వింటాళ్లు కోతపెట్టడంతో రైతులతో పాటు ధాన్యాన్ని చెక్ చేసిన ఏఈవో కూడా షాకయ్యాడు.

ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధితో చాలా చోట్ల ధాన్యం ఎంత శుభ్రంగా ఉన్నా, కోతలు పెట్టడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిల్లర్ల తీరును నిరసిస్తూ పలు చోట్ల రోడ్లపై బైఠాయించి మండిపడుతున్నారు. ఏఈవోలు చెక్ చేసి పంపిన ధాన్యాన్ని మళ్లీ తాలు పేరుతో కోత పెట్టడం ఏంటి ప్రశ్నిస్తున్నారు. కోతలు లేకుండా ధాన్యం దిగుమతి చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### నిన్న యూరియా కొరత.. నేడు తాలు పేరుతో కోతలు

ఈ సీజన్ పంటసాగుకోసం అరిగోస పడినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుకింగ్ పేరుతో యూరియా దొరక్క అరిగోసపడ్డామని, చిరకు బ్లాక్ లో యూరియా కొని ధాన్యం పండించామని చెప్పారు. మాడపగిలే ఎండలో ధాన్యం ఆరబోసిన తర్వాత, చివరికి తాలు పేరుతో మిల్లు దగ్గర కట్ చేయడం ఏంటని మండిపడుతున్నారు. వ్యవసాయం చేయడం కంటే పడావు పెట్టడం మంచిదని తలబాదుకుంటున్నారు.

### ధాన్యం అమ్ముకోలేక రైతుల ఆవేదన

ప్రభుత్వాలు మారినా రైతుల కష్టాలు తప్పడం లేదంటున్నారు. అష్ట కష్టాలు పడి పంటను కోనుగోలు కేంద్రానికి తీసుకొస్తే, ఇక్కడ కూడా అమ్ముకునే పరిస్థితి లేదంటున్నారు. ఎండనకా, వాననకా వరిసాగు చేస్తే, అమ్ముకునే దగ్గరికి వచ్చేసరికి నిలువు దోపిడీ చేస్తున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యంలో తాలు లేకుండా పట్టి కాంటాలు వేయించుకుంటే బాగుంటుందని ఏఈవోలు సూచిస్తున్నారు. నిర్ణీత పరిధిలో తేమశాతం ఉండటంతో పాటు తాలు, మట్టిపెళ్లలు లేకుండా చూసుకోవాలంటున్నారు. శుభ్రంగా ఉన్న ధాన్యానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెప్తున్నారు. ఒకవేళ ధాన్యం శుభ్రంగా ఉన్నా మిల్లర్లు కొర్రీలు పెడితే, మండలానికి ఓ పర్యవేక్షణ అధికారి ఉన్నారని, వారికి రైతులు ఫిర్యాదు చేయాలంటున్నారు.

### ప్రభుత్వ తీరుపై విపక్షాల ఆగ్రహం

మరోవైపు విపక్ష పార్టీలకు చెందిన నాయకులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, రైతులతో మాట్లాడుతున్నారు. వారికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. ఏఈవోలు ధాన్యం పరిశీలన చేసి కాంటాలు అయిన ధాన్యానికి మళ్లీ తాలు పేరుతో కోతలు పెట్టడం ఏంటని మండిపడుతున్నారు. కాంటాలు అయిన ధాన్యానికి కూడా ఖాతాల్లో డబ్బులు పడేందుకు 10 రోజులకు పైగా సమయం పడుతుందంటున్నారు. ప్రభుత్వం 24 గంటల్లో డబ్బులు పడతాయని చెప్తున్నా, వాస్తవ పరిస్థితులు పూర్తి విరుద్ధంగా ఉన్నాయంటున్నారు. అన్నదాతలను ఇబ్బందులు పెడితే పెద్ద ఎత్తున్న ఆందోళనలు చేస్తామని హెచ్చరిస్తున్నారు. రైతుల జీవితాలతో ఆటలు ఆడుకోవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు.



# ఈదురుగాలులతో భారీ వర్షాల హెచ్చరిక

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి** జయశంకర్ జిల్లా వ్యాప్తంగా రానున్న రెండు రోజుల్లో ఈదురుగాళ్లతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. గంటకు 50 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటీవల జిల్లాలో తీవ్ర ఎండలు నమోదవుతున్న నేపథ్యంలో ఈ వర్షాలు కొంత ఉపశమనం కలిగించే అవకాశముంది. అయితే, ఇదే సమయంలో రైతులకు కొత్త సమస్యలు తలెత్తే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం కోత దశలో ఉన్న వరి, ఇతర పంటలు ఈదురు గాలులతో పాటు వచ్చే వర్షాల వల్ల దెబ్బతినే ప్రమాదం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మరోవైపు, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడిసే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరైన రక్షణ చర్యలు లేకపోతే భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల తాత్కాలిక షెడ్లు, కవర్లు సరిపోవడం లేదని సమాచారం. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని రక్షించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. రైతులు కోత పూర్తయిన పంటను వీలైనంత త్వరగా సురక్షిత ప్రదేశాలకు తరలించుకోవాలని సూచిస్తున్నారు. ఈదురుగాలుల తీవ్రత దృష్ట్యా ప్రజలు చెట్లు, బలహీన నిర్మాణాల దగ్గర నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరం లేకపోతే బయటకు వెళ్లకపోవడం మంచిదని హెచ్చరి స్తున్నారు.

# మంథని నియోజకవర్గంలో అభివృద్ధికి బూస్ట్

**- రూ. 15 కోట్లతో 300 మౌలిక సదుపాయాల పనులకు గ్రీన్ సిగ్నల్**

**- డబుల్ ఫండింగ్‌కు చెక్ పెట్టాలని అధికారులకు ఆదేశం**

**- మంత్రి శ్రీధర్ బాబుకు ప్రత్యేక ధన్యవాదములు : విలాస్ రావు**

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి**

మంథని శాసనసభ నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మొత్తం 300 అభివృద్ధి పనులకు పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పనుల కోసం సుమారు రూ. 15.00 కోట్ల అంచనా వ్యయం కేటాయించబడింది. ఈ ప్రాజెక్టులకు అవసరమైన నిధులు సిఆర్ఆర్ 2025-26 (ఎస్సీపీ) గ్రాంట్ కింద సమకూరనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వంటి ప్రాథమిక సదుపాయాల అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా ఈ పనులు చేపట్టనున్నారు. అయితే, పనులు ప్రారంభించే ముందు ఒక ముఖ్యమైన ఆదేశాన్ని ప్రభుత్వం జారీ చేసింది. ఇదే పనులు ఇప్పటికే ఇతర గ్రాంట్ల కింద మంజూరై ఉన్నాయా లేదా అన్న విషయాన్ని తప్పనిసరిగా పరిశీలించాలని ఇంజనీర్-ఇన్-చీఫ్తో పాటు సంబంధిత ఇంజనీర్లకు స్పష్టమైన సూచనలు ఇచ్చింది. డబుల్ ఫండింగ్, నిధుల దుర్వినియోగం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ నిర్ణయంతో మంథని నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని, స్థానిక ప్రజలకు మౌలిక సదుపాయాలు మరింత మెరుగవుతాయని అధికారులు భావిస్తున్నారు.

### విలాస్ రావు స్పందన..

మంథని శాసనసభ నియోజకవర్గంలో 300 మౌలిక సదుపాయాల పనులకు పరిపాలనా అనుమతి మంజూరు చేయడంపై యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి (మాజీ..) విలాస్ రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా విలాస్ రావు మాట్లాడుతూ, రూ. 15 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులు మంథని ప్రాంతంలో మౌలిక వసతుల పెరుగుదలకు దోహదం చేస్తాయని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో మంథని నియోజకవర్గం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలని విలాస్ రావు ఆకాంక్షించారు.

# నమస్తే తెలంగాణ రిపోర్టర్ మల్లేష్ ను పరామర్శించిన టీజేఏ జిల్లా అధ్యక్షుడు షానూర్ బాబా

**ఆత్మకూరు ఎం, మే03/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి టౌన్ నమస్తే తెలంగాణ రిపోర్టర్ బోయిని మల్లేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా వారి ఇంటికి వెళ్లి పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దురదృష్టవశాత్తు ఇలాంటి సంఘటన జరిగినప్పుడు జర్నలిస్ట్ లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజేఏ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిల్లా మొహమ్మద్ ఖాజా ఫసిఓద్దీన్,ప్రచార కార్యదర్శి బైరపాక సిరిల్,తదితరులు పాల్గొన్నారు.



# కూరెళ్ళ గ్రామంలో నిర్వహిస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభను జయప్రదం చేయండి

## తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కన్వీనర్ తుమ్మలగూడెం యాదయ్య డిమాండ్

**ఆత్మకూరు ఎం, మే 03/క్రైమ్ మిర్రర్:**యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం కూరెళ్ల గ్రామంలో మే 5వ తేదీన నిర్వహిస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభను వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ కార్మికులు, గ్రామీణ పేదలు పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కన్వీనర్ తుమ్మలగూడెం యాదయ్య పిలుపు నిచ్చారు. ఆదివారం కూరెళ్ల గ్రామంలో ఈనెల 5వ తేదీన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆత్మకూరు మండల మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ గ్రామంలో కరపత్రం ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అనేక కూలీ, భూమి పోరాటాలు నిర్వహించి వ్యవసాయ కూలీలకు పేదలకు అండగా నిలిచిందని తెలిపారు. గ్రామీణ వ్యవసాయ కూలీలకు పని కల్పించాలని డిమాండ్ చేస్తూ తిండన్న పెట్టండి, పనన్న చూపండి అనే నినాదంతో దేశవ్యాప్త ఉద్యమాల ఫలితంగానే 2005లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం వచ్చిందని తెలిపారు. ఉపాధి హామీ ద్వారానే గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మార్పులు వచ్చి పేదలకు వ్యవసాయ కూలీలకు



కాస్త పని దొరుకుతుందని అన్నారు. గ్రామీణ పేదలకు బువ్వ పెట్టి ఉపాధి హామీ పథకాన్ని మోడీ ప్రభుత్వం ఎత్తివేయాలని కుట్రలు చేస్తుందని ఈ కుట్రలకు వ్యతిరేకంగా ఉపాధి హామీ రక్షణ కోసం, సమస్యల పరిష్కారం కోసం, పేదలకు ప్రభుత్వ భూములు పంచాలని, కూలీ రేట్లు పెంచాలనే ఉద్యమాలు రూపొందించడానికి ఈ మహాసభ నిర్వహిస్తున్నామని ఈ మహాసభలో వ్యవసాయ కూలీలు ఉపాధి హామీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని యాదయ్య కోరారు. ఈ కార్యక్రమంలో వృత్తిదారుల సంఘం మండల కన్వీనర్ వేముల భిక్షం నాయకులు భాషా బోయిన రాములు బండ బీరయ్య మరిపెల్లి మల్లయ్య భానపైన ఐలయ్య ఆమనగంటి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ 67వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

**క్రైమ్ మిర్రర్ వలిగొండ:** అఖిల భారత యువజన సమాఖ్య ఏ ఐ వై ఎఫ్ 67 వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా, వలిగొండ మండల కేంద్రంలోని సిపిఐ పార్టీ ప్రాంగణంలో, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు మారోజు నరసింహ చారి చేతుల మీదుగా జెండాను ఆవిష్కరించారు. ఏ ఐ వై ఎఫ్ యొక్క ఘనమైన చరిత్రను, భగత్ సింగ్ ఆదర్శాల పట్ల దాని అచంచలమైన నిబద్ధతను గుర్తుచేసుకుంటూ, ఉపాధి,విద్య, సామాజిక న్యాయంతో సహా యువత హక్కుల కోసం పోరాడటానికి తమ అంకితభావాన్ని పునరుద్ఘాటించారు. ప్రస్తుత రాజకీయ, ఆర్థిక పరిస్థితులలో యువజన ఉద్యమాలను బలోపేతం చేయవలసిన ప్రాముఖ్యతను ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్ మాట్లాడుతూ నొక్కిచెప్పారు. నిరుద్యోగం, ప్రైవేటీకరణ, అసమానతలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలలో యువత ఏకమై చురుకుగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మాజీ నాయకులు సల్వాద్రి రవీందర్,బొడిగ సుదర్శన్,ఏఐవైఎఫ్ మండల సహాయ కార్యదర్శి గుండె గాని నాగరాజు, కనక బోయిన నందు, ఎంగోజు ప్రశాంత్, నాసచర్ల సాయి నితిన్ పాల్గొన్నారు. వీరందరూ సంస్థ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి మరియు మెరుగైన, సమానత్వంతో కూడిన సమాజం కోసం పోరాటాలను తీవ్రతరం చేయడానికి ప్రతిజ్ఞ చేశారు.












## ఎండ వేడి నుండి ఉపశమనం కల్పించేలా మజ్జిగ పంపిణీ చేసిన జనని స్వచ్ఛంద సేవా సంస్థ


**ఆత్మకూరు ఎం, మే03/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీలో సేవా కార్యక్రమాలకు మారుపేరైన జనని స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎండ దెబ్బకు గురికాకుండా ఎండ వేడి నుండి ఉపశమనం కల్పించేలా పట్టణ ప్రజలకు మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ మైదం భాస్కర్ మాట్లాడుతూ సంస్థ సభ్యుల సహకారంతో చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో తృప్తినిస్తున్నాయని ఆనందాన్ని వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మైదం భాస్కర్ – సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్,పేరపు ఆనంద్– అధ్యక్షులు, కమలాకర్ కుంతావత్– కన్వీనర్,ఆలేటి శ్రీకాంత్,పడకంటి చంద్రశేఖర్, మైదం బాను,జూకంటి సిద్దులు,మద్దూరి శ్రీకాంత్, ఉల్లోజు సురేష్ చారి,జూకంటి క్రిష్ణ,మైదం రాజేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పద మృతి...ఎలికేశ్వరం సమీపంలో యువకుడి మృతదేహం

**- బొమ్మాపూర్ గ్రామానికి చెందిన శనిగరం శ్రీకాంత్ గా గుర్తింపు**

**- అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి** మహాదేవపూర్ మండలం ఎలికేశ్వరం గ్రామ సమీపంలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. మృతి చెందిన యువకుడు బొమ్మాపూర్ గ్రామానికి చెందిన శనిగరం శ్రీకాంత్ (25)గా గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్సై పవన్ కుమార్ వెంటనే ఘటన స్థలానికి



చేరుకుని పరిస్థితులను పరిశీలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, శ్రీకాంత్ మృతదేహం అనుమానాస్పద పరిస్థితుల్లో కనిపించడంతో కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు సంఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనకు గల అసలు కారణాలు పోస్టుమార్టం నివేదిక అనంతరం వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. గ్రామంలో ఈ సంఘటనతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.





## ఘనంగా పుట్టు పంచెలు, పుట్టు ఓణీల మహోత్సవం

**- చిన్నారులను ఆశీర్వదించిన ప్రముఖులు**

**నిజాంపేట్, మే 3 (క్రైమ్ మిర్రర్):** దార్కు నిర్మల, మోహన్ రావు (మాజీ సర్పంచ్) దంపతుల మనుమలు వేదిక్ రావు, అద్వైత్ రావుల పుట్టు పంచెలు, మనుమరాళ్లు ఆరుషి, వేదాన్షిల పుట్టు ఓణీలు వేడుకలు కామారెడ్డిలో ఆదివారం కన్నుల పండువగా జరిగాయి. బంధుమిత్రుల కోలాహలం మధ్య జరిగిన ఈ శుభకార్యానికి పలు ప్రాంతాల నుంచి ఆత్మీయులు విచ్చేసి సందడి చేశారు. ?ముఖ్యంగా హైదరాబాద్ నిజాంపేట్ పరిధిలోని ప్రగతి నగర్ నుంచి బొట్ల తిరుపతి, శరత్ రెడ్డి, వడ్లకొండ సందీప్, మెరుగు రమేష్, విజయ్ రెడ్డి, సాయి గౌడ్, ప్రసాద్, నందు, సంతోష్ తదితరులు కుటుంబ సమేతంగా ఉత్సాహంగా హాజరయ్యారు. హిందూ సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వేడుకలలో వీరంతా నూతన వస్త్రాలు ధరించిన చిన్నారులను మనసారా ఆశీర్వదించి, ఉజ్వల భవిష్యత్తుకై శుభాకాంక్షలు తెలిపారు.

## బీర్ల ఫౌండేషన్ చైర్పర్సన్ బీర్ల అనితకి వివాహ పత్రికను అందించి కుమార్తె వివాహానికీ ఆహ్వానించిన స్వరూప



**ఆత్మకూరు ఎం, మే03/క్రైమ్ మిర్రర్:** తెలంగాణ ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సతీమణి బీర్ల ఫౌండేషన్ చైర్ పర్సన్ బీర్ల అనితకి వివాహ పత్రికను అందించి ఆహ్వానించారు.వారి నివాసం వద్ద ఆత్మకూరు (ఎం)మండల కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరు కాంగ్రెస్ నాయకులు మారబోయిన స్వరూప (కీర్తిశేషులు- కుమార్ )వారి కుమార్తె వివాహానికి బీర్ల ఫౌండేషన్ ద్వారా 5000 మరియు యువజన కాంగ్రెస్ నాయకులు పైళ్ళ దేవేంద్ర( కీర్తిశేషులు కిష్టయ్య )ద్వితీయ కుమారుడు మహేష్ వివాహకి బీర్ల ఫౌండేషన్ 5000 రూపాయలు అందజేయడం జరిగింది. సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డి మాజీ సర్పంచ్ జన్నాయి కోడె నగేష్ ఓబీసీ సెల్ చైర్మన్ బత్తిని ఉప్పలయ్య వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్ధులు గ్రామ శాఖ ఉపాధ్యక్షులు ఉగ్గె నరేష్ నారబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.

## పార్కుల అభివృద్ధికి కృషి... మాజీ కార్పొరేటర్ మందడి



కూకట్ పల్లి, మే 03 (క్రైమ్ మిర్రర్) :కూకట్ పల్లి నియోజకవర్గం, కే పీ హెచ్ బీ కాలనీలో ఉన్నటువంటి ఖాళీ స్థలాలను ఆహ్లాదకరమైన పార్కులుగా అభివృద్ధి చేయడం జరిగిందని మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అన్నారు. కే పీ హెచ్ బీ కాలనీ ధర్మ రెడ్డి కాలనీ పేజ్ 1 లోని పార్కులను అభివృద్ధి చేసినందుకు మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ని ఆదివారం భారతీయ యోగ సంస్థాన్ సభ్యులు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. స్థానిక ఎమ్మెల్యే కృష్ణారావు, అధికారుల సహకారంతో కాలనీలోని పార్కులన్నిటిని అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. చిన్నారులు, మహిళలు, యువతకు ఉపయోగపడేలా పార్కులను అభివృద్ధి చేశామన్నారు. కాలనీ అభివృద్ధి కోసం కష్టపడి పని చేస్తున్న అసోసియేషన్ నేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు గోపాల్, దీపక్, రామకృష్ణయ్య, సుబ్బరాయుడు, రాజు, సత్యవతి, సుధా, మహేశ్వరి, వనజ తదితరులు ఉన్నారు.

# 'ఎల్లిపాయకారం రెస్టారెంట్' ప్రారంభం





### ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ చేతుల మీదుగా

### నాటు నాటు రుచులతో గచ్చిబౌలిలో 'ఎల్లిపాయకారం రెస్టారెంట్'

### పాల్గొన్న పలు సినీ, రాజకీయ ప్రముఖులు

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్:** నగరంలోని గచ్చిబౌలిలో ప్రముఖ ఫుడ్ బ్రాండ్ 'ఎల్లిపాయకారం' నూతన అవుట్‌లెట్ ను ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఘనంగా ప్రారంభించారు. గచ్చిబౌలిలోని ఎల్లో సఫైర్ హోటల్స్ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి రాజకీయ, సినీ సెలెబ్రేటీలు హాజరై సందడి చేశారు. ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, నటి కె సుధ, నటులు మధు దామరాజు, మహేష్ ఆచంట, షఫీ, దర్శకుడు కార్తీక్ దండు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని రుచులను ఆస్వాదించారు.ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ.. సాంప్రదాయ ఆరోగ్యకరమైన ఎల్లిపాయ కారంను నగర ప్రజలకు అందించడం అభినందనీయం. ఎల్లిపాయ కారం మరో బ్రాంచి గచ్చిబౌలిలో ఏర్పాటు చేసిన నిర్వాహకులకు శుభాకాంక్షలు. తెలిపారు.ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. ఎల్లిపాయకారం ఐటీ ప్రాంతంలో నాటు రుచులను అందించడం అభినందనీయం. ఆరోగ్య పరంగా ఎల్లిపాయకారం ఎంత మంచిదో ఈ రెస్టారెంట్ అలాంటి ఆహారం అందించాలి. ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న ఎల్లో శాఫిరే హోటల్ నిర్వాహకులకు అభినందనలు, శు భాకాంక్షలు.నూతనంగా ప్రారంభమైన ఈ 'ఎల్లిపాయకారం రెస్టారెంట్ ' అవుట్‌లెట్‌లో సంప్రదాయ రుచులతో పాటు ఆధునిక శైలిలో తయారు చేసే వివిధ రకాల ప్రత్యేక వంటకాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఫౌండర్ గంగా విరజ్ కోట, కో-ఫౌండర్ సాయిశ్రీ తెలిపారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు ప్రత్యేకమైన నాటురుచులను ఫాస్ట్ ఫుడ్ తరహాలో ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో ఎల్లిపాయకారం - గచ్చిబౌలి అవుట్‌లెట్‌ను సిద్ధి వినాయక ఫుడ్ అండ్ బేవరేజ్ కంపెనీ నుంచి ప్రారంభించినట్టు చెప్పారు. ఎల్లిపాయకారం చికెన్ వేపుడు, ప్రవున్స్ ఫ్రై రోస్ట్, బిర్యానీ.. వంటి ఎన్నో రకాల ఫుడ్ ఐటమ్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పరిశుభ్రత, నాణ్యతకు పెద్దపీట వేస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని నిర్వాహకులు స్పష్టం చేశారు. అన్ని రకాల ఈవెంట్స్‌కి క్యాటరింగ్ సర్వీస్ కూడా అందిస్తామని తెలిపారు.ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడిన అతిథులు, 'ఎల్లిపాయకారం' బ్రాండ్ భవిష్యత్తులో మరిన్ని శాఖలను ప్రారంభించి యువతతో పాటు కుటుంబాలకూ నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందిస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. సెలబ్రిటీల సందడి, స్థానికుల ఉత్సాహంతో గచ్చిబౌలిలో జరిగిన ఈ ప్రారంభోత్సవం పండుగ వాతావరణాన్ని తలపించింది. కొత్త అవుట్‌లెట్ ప్రారంభంతో ఆ ప్రాంతంలోని ఫుడ్ లవర్స్‌కు మరో రుచికరమైన ఆప్షన్ అందుబాటులోకి వచ్చినట్లైంది.

# గాలి దుమారంతో షార్ట్ సర్క్యూట్, కాలి బూడిదైన పురుగుమందుల దుకాణం!

### నల్లగొండ జిల్లాలో ఈదురు గాలుల బీభత్సం

### పలు ప్రాంతాల్లో మెరుపులతో కూడిన వర్షం

### చిన్నమాధారంలోని పురుగు మందుల దుకాణంలో షార్ట్ సర్క్యూట్

### కాలి బూడిదైన పురుగు మందులు, భారీగా నష్టం

**క్రైమ్ మిర్రర్, నల్లగొండ:** ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆదివారం(మే 3) సాయంత్రం సమయంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. పలు చోట్ల గాలి దుమారానికి పరిస్థితి గందరగోళంగా మారింది. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోని పలు ఏరియాల్లో రాళ్ల వర్షం కురిసింది.

### షార్ట్ సర్క్యూట్ కాలిపోయిన ఎరువుల దుకాణం



ఇక కనగల్ మండల పరిధిలోని చిన్న మాదారం గ్రామంలో భారీ వర్షం కురిసింది. ఈ సమయంలో పెద్ద మొత్తంలో ఈదురు గాలులు వీచడంతో కరెంట్ సప్లైలో సమస్యలు తలెత్తాయి. ఫలితంగా స్థానికంగా ఉన్న రుత్విక్ సీడ్స్, ఫెస్టిసైడ్స్ దుకాణంలో షార్ట్ సర్క్యూట్ జరిగింది. కరెంటులో హెచ్చుతగ్గుల కారణంగా మెయిన్ లైన్ లో మంటలు చెలరేగాయి.

కాసేపట్లోనే దుకాణం అంతా దట్టమైన పొగతో పాటు మంటలు వ్యాపించాయి. వెంటనే స్పందించిన స్థానికులు నీళ్లు తెచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. కొద్దిసేపటి తర్వాత మంటలు అదుపులోకి వచ్చాయి. అప్పటికే ఫెస్టిసైడ్స్, గులికలు, న్యూట్రీన్స్ లిక్విడ్, పౌడర్లు కాలిపోయాయి. సుమారు రూ. 2 లక్షలకు పైగా మందులు కాలిపోయినట్లు దుకాణం యజమాని గాజుల సైదులు ఆవేదన వ్యక్తం చేశారు.

### ప్రమాదానికి ముందే లంచ్ కు వెళ్లిన యజమాని

ప్రమాద సమయంలో దుకాణంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణహాని కలగలేదు. ఈ యాక్సిడెంట్ కు కొద్దిసేపటి ముందే షాపు యజమానికి సైదులు లంచ్ కు వెళ్లడంతో పెద్ద ముప్పు తప్పినట్లు అయ్యింది. జరిగిన నష్టాన్ని ఆయా పురుగు మందుల కంపెనీలకు చెప్పినట్లు యజమానికి చెప్పారు. తమనకు ఆదుకోవాలని సైదులు విజ్ఞప్తి చేశారు.



## అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడిగా చెట్టిమల్ల



**చింతపల్లి(క్రైమ్ మిర్రర్):** చింతపల్లి మండల అంబేడ్కర్ యువజన సంఘం, నూతన అధ్యక్షుడిగా చెట్టిమల్ల ప్రశాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా, మండల వ్యాప్తంగా ఉన్న అంబేడ్కర్ వాదులు, యువత ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. సామాజిక న్యాయం, సమానత్వం అనే ప్రాథమిక సూత్రాల ఆధారంగా పనిచేస్తున్న ఈ సంఘం, యువతలోని చైతన్యాన్ని బలోపేతం చేయడమే, తమ ప్రధాన బలం అని ప్రకటించింది. బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్. అంబేడ్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి, కృషి చేస్తామని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు. సేవ చేయడమే పరమావధిగా, అభివృద్ధిని ధ్యేయంగా పెట్టుకుని నిబద్ధతతో ముందుకు సాగుతామని, ముఖ్యంగా యువతను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తామని నూతన అధ్యక్షులు చెట్టిమల్ల ప్రశాంత్ ధీమా వ్యక్తం చేశారు. నిరంతరం ప్రజా క్షేత్రంలో ఉంటూ, అంబేడ్కర్ సిద్ధాంతాలను ఇంటింటికీ చేరవేస్తూ, మండల పరిధిలోని సామాజిక సమస్యల పరిష్కారానికి పోరాడుతామని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ నియామకం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయన నాయకత్వంలో చింతపల్లి మండల యువజన సంఘం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

## ప్రైవేట్ యూనివర్సిటీల లబ్ధి కోసమే కోసమే జీవో7

### బడుగులకు ఉన్నతవిద్య దూరంచేసే కుట్ర

### బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశ్వంత్ కుమార్ ధ్వజం

### విద్యాభరోసా కార్డు అమలు చేయాలని డిమాండ్

**కూకట్ పల్లి, మే 03 (క్రైమ్ మిర్రర్) :**ప్రైవేట్ యూనివర్సిటీల లబ్ధి కోసమే రేవంత్ రెడ్డి సర్కార్ జీవో 7ను తీసుకొచ్చిందని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశ్వంత్ కుమార్ ఒక ప్రకటనలో ఆరోపించారు. యూనివ ర్సిటీల గుర్తింపుతో (అఫిలియేషన్తో) నడిచే కాలే జీలు మూతపడటమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నదని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనారిటీ వర్గాలతోపాటు దివ్యాంగులకు ఉన్నత విద్యను దూరం చేయాలని రేవంత్ సర్కార్ కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. సర్కార్ వైఖరితో ఉన్నత విద్యకు బడుగు వర్గాలు దూరమవుతా యని, ఉన్నత వర్గాలే ఉన్నత విద్యను అభ్యసిస్తా యని ధ్వజమెత్తారు. జీవో 7 ద్వారా డీబీటీ పద్ధతిలో ఏ నెలలో ఎంత శాతం ఫీజులు చెల్లిస్తారో స్పష్టత లేక విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా రని పేర్కొన్నారు. ఈ డీబీటీ విధానంలో విద్యార్థుల నుంచి ఫీజు వసూలు చేయవ ద్దని ప్రభుత్వ ఆదేశాలను కాలేజీ యాజ మాన్యాలు పాటించే పరిస్థితి ఉండదని తెలిపారు. కేవలం ఫీజులు చెల్లించిన విద్యార్థులకే అడ్మిషన్లు ఖరారు చేసే పరిస్థితి ఉంటుందని తెలిపారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసానికి దూరమవుతారని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టిన 5 లక్షల విద్యాభరోసా కార్డు పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.



# కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా స్నాతకోత్సవ వేడుక



**కోదాడ మే 03 ( క్రైమ్ మిర్రర్)** కోదాడ : స్థానిక కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో స్నాతకోత్సవ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో కళాశాల చైర్మన్ డాక్టర్ నీలా సత్యనారాయణ పాల్గొని, పట్టభద్రులను ఉద్దేశించి మాట్లాడుతూ, మానవ విలువలతో కూడిన విద్యను, అత్యాధునిక సాంకేతికతను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని, భవిష్యత్తును రూపొందించే ఆవిష్కరణలను చేపట్టాలని పట్టభద్రులకు సూచించారు, అలాగే గ్రామీణ స్థాయి నుంచి ఇంజనీరింగ్లో పట్టబద్రులు కావడం ఎంతో గర్వకారణమని, ఇదే స్ఫూర్తితో ఉన్నత ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని పట్టభద్రులకు సూచించారు.అదేవిధంగా గ్రామీణ ప్రాంతంలో ఉన్నత ప్రమాణాలతో సాంకేతిక విద్యను విద్యార్థినులకు అందించాలని ఉద్దేశంతో కళాశాలను స్థాపించినట్లు వివరించడం జరిగింది.అలాగే పట్టభద్రులకు స్నాతకోత్సవ పట్టాలను కళాశాల చైర్మన్ అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెరుమాళ్ళపల్లి గాంధీ, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాగార్జున రావు, వివిధ విభాగాధిపతులు రమేష్, నరేష్ రెడ్డి, స్రవంతి, శివాజీ, లక్ష్మణ్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు, తల్లితండ్రులు పాల్గొన్నారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి.



# సర్వర్ డౌన్ చేసిన ప్రభుత్వం మొక్కజొన్న బస్తాలు లోడ్ చేసిన కదలని లారీలు

**రైతు సంఘం నిరసన**

**వైరా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ గోదాముల్లో మొక్కజొన్న బస్తాలు దిగుమతి కి అవకాశం ఇవ్వాలి**

**సోమవారం ఖమ్మం లో రైతు ప్రదర్శన**

**తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు**



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వం సర్వర్ నిలుపుదల చేయడం తో ఖమ్మం జిల్లాలో నిలిచిపోయింది అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు.

మొక్కజొన్న సాగు చేసిన రైతులు వివరాలు, దిగుమతి చేయాల్సిన గోదాములు వివరాలు సర్వర్ నిలుపుదల వలన కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్న బస్తాలు లోడ్ చేసిన లారీలు కు కొనుగోలు సిబ్బంది ట్రక్ సిట్ ఇవ్వకపోవడం తో రైతులు నిరసన వ్యక్తం చేశారు.

శని, ఆదివారం లారీలు కొనుగోలు కేంద్రాల్లో నే నిలిచి పొయాయి. ఆదివారం ఖమ్మం జిల్లా లో కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యలను రైతు సంఘాల బృందాలు పరిశీలనలో భాగంగా వైరా మండలం లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులను తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కారం చేయాలి అని నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ ఎండ వేడిమి తీవ్రత పెరిగి ఖమ్మం జిల్లా లో కొన్ని మండలాలు రెడ్ జోన్ పరిధిలోకి వచ్చే అవకాశం ఉందని మరోవైపు ఖమ్మం జిల్లా చుట్టూ వడగండ్ల వాన, పిడుగులు పడుతున్నా ప్రభుత్వం లో చలనం లేకుండా పోయింది అని అన్నారు, ఖమ్మం జిల్లా లో పండిన మొక్కజొన్నలు దిగుమతి చేయుటకు అవసరమైన గోదాములు ఖమ్మం, వైరా, మధిర, ఏన్కూరు వ్యవసాయ మార్కెట్లో గోదాములు అందుబాటులోకి తీసుకు వచ్చి రైతులు ట్రాక్టర్లు తో కొనుగోలు కేంద్రాలు నుంచి ఎగుమతి కి అవకాశం ఇవ్వాలి అని డిమాండ్ చేశారు మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడిగాపులు కు పరిష్కారం చూపాలని మే 4 సోమవారం ఖమ్మం జిల్లా పరిషత్ నుంచి నూతన కలెక్టరేట్ వరకు రైతు సంఘాలు సమిష్టి గా నిర్వహిస్తున్న ప్రదర్శన రైతులు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమరనేని అప్పారావు నల్లమోతు రాజా బాబు చంద్ర ప్రసాద్ చంద్ర వెంకట్రావు అమరనేని సాంబశివరావు ఆళ్ళ శ్రీనివాస్ గుమ్మా మురళి చంద్ర రాము రాజేంద్ర ప్రసాద్ వేమూరి నగేష్ తదితరులు పాల్గొన్నారు



## బీఆర్ఎస్ కు వీడ్కోలు... కాంగ్రెస్ గూటికి చేరిన నూకల మల్లయ్య యాదవ్ మంత్రి పొంగులేటి సమక్షంలో చేరిక

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** కూసుమంచి మండల పరిధిలోని చౌటాపల్లి గ్రామానికి చెందిన నూకల మల్లయ్య యాదవ్ ఆదివారం బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ ఇచ్చారు చౌటపల్లిలో కరుడు గట్టిన కాంగ్రెస్ వాది తన సొంత గూటికి కాంగ్రెస్ పార్టీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో వారితో పాటుగా చౌటపల్లి గ్రామ కాంగ్రెస్ సర్పంచ్ మక్కా రామకృష్ణ గౌడ్ గ్రామ మాజీ సర్పంచ్ కాందాల రవి మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొవ్వూరు పెద్ద వెంకటరెడ్డి చౌటపల్లి కాంగ్రెస్ ముదిరాజ్ సంఘ చేపల సొసైటీ సర్పంచ్ తురక వెంకన్న గ్రామ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు నందిపాటి ఉప్పయ్య నందిపాటి వెంకన్న సమక్షంలో నూకల మల్లయ్య యాదవ్ ను కాంగ్రెస్ పార్టీలో ఆహ్వానించారు అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు ఎలాటి లోటు లేకుండా చేస్తానని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ నాయకులు నందిపాటి రవి నూకల వెంకన్న మక్కా సతీష్ మాడికంటి చర్ల వెంకన్న ఈసారపు అశోక్ మడికంటి బాలకృష్ణ ఒంటిపులి వెంకటేశ్వర్లు ఒంటిపులి రాంబాబు గుమ్మడెల్లి రాజు తురక కాశయ్ గుర్రాల వీరన్న కసగాని రవి గ్రామ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## 25 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం పెద్దకాపర్తి జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో 2000- 2001 సంవత్సరంలో పదవ తరగతి వరకు చదివి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పాఠశాల ఆవరణంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించడం జరిగింది. పాఠశాలలో చదువుకున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఘనంగా చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించడం జరిగింది.ఎంతో ఉత్సాహంగా పాతికేళ్లయిన తరగని ఆప్యాయత పాఠశాల ఆవరణంలో మళ్లీ చిగురించే పాత మిత్రుల రాకతో మనసంతా సంతోషం పొంగి పొర్లె ఎంతో ఆనందంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆగయ్య, అమరేందర్ రెడ్డి,యాదయ్య, యాదగిరి, పుష్పగిరి, చంద్రశేఖర రావు, రామ్మూర్తి, అంజయ్య, శ్రీరాములు, చంద్రశేఖర్,విద్యార్థినీ విద్యార్థులు రాఘవేందర్, మల్లేష్, రాజు, నరసింహ, రమేష్, శివశంకర్ రెడ్డి, కవిత, స్వప్న, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

# కన్నీరు పెడుతున్న తిరుమలాయ పాలెం మండల రైతులు



## కేంద్రాలున్నా దక్కని భరోసా రాత్రంతా కల్లాల వద్దే రైతుల జాగారం

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తిరుమలాయపాలెం మండలం వ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలకు రైతన్నలు పండించిన పంట నీటిపాలవుతోంది. నెలల తరబడి శ్రమించి చేతికి వచ్చిన వరి మొక్కజొన్న దిగుబడులు ఐకేపీ,ఐకేపీ కేంద్రాల్లో కొనుగోలు చేయక పోవడంతో కల్లాల వద్దే తడిసి ముద్దవుతున్నాయి. ఆదివారం పేరుకే కేంద్రాలు అన్నీ ఆటంకాలేప్రభుత్వం ఆర్భాటంగా ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. తిరుమలాయపాలెం మండలంలోని దాదాపు ప్రతి గ్రామంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కొనుగోళ్లలో జాప్యం ధాన్యం ఆరబెట్టి సిద్ధంగా ఉంచినా అధికారులు కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. వరద పాలు ఆకాశం మేఘావృతమై వర్షం కురుస్తుండటంతో, కల్లాల్లో ఉన్న ధాన్యం వరద నీటిలో కొట్టుకుపోతోంది. మరికొన్ని చోట్ల ధాన్యం మొలకలు వస్తుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కాపలాగా అన్నదాత అకాల వర్షాల నుంచి పంటను కాపాడుకోవడానికి తడిచిన ధాన్యంపై పరదాలు కప్పి రాత్రంతా కల్లాల వద్దే జాగారం చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టాం తీరా పంట చేతికొచ్చేసరికి ఐకేపీ కేంద్రాల్లో కొనే నాదుడే లేడు వర్షం వస్తే మాకష్టమంతా అకాల వర్షాల వరద నీళ్లలో వరి మొక్కజోన్న పాటలు కోట్టుకోపోతోంది మమ్మల్ని ఆదుకునే వారు లేరా అని స్థానిక రైతు ఆవేదన వ్యక్తం చేశారు.



### ప్రభుత్వానికి రైతుల విన్నపం

ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా తక్షణమే స్పందించి తడిచిన ధాన్యాన్ని కూడా నిబంధనలు సడలించి కొనుగోలు చేయాలి అని మండల రైతులు డిమాండ్ చేస్తున్నారు పాలేరు నియోజకవర్గ తిరుమలాయపాలెం మండల ప్రజాప్రతినిధులు జిల్లా అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.అన్నదాతల కష్టాన్ని గుర్తించి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయకపోతే, రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉందన్ని మండల రైతులు ప్రభుత్వాన్ని కోరుతూ ఆవేదన వ్యక్తం చేశారు.

# హత్య యత్నానికి పాల్పడిన ఇద్దరు పాత నేరస్తులు అరెస్టు

## రిమాండ్ తరలించిన జగద్గిరిగుట్ట పోలీసులు

## శాంతిభద్రతలకు విగాథం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవు... జగద్గిరిగుట్ట సీఐ వెంకటేశం

**కుత్బుల్లాపూర్, మే 03 (క్రైమ్ మిర్రర్):** ఓ వ్యక్తిపై కత్తులతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడి పరారీ అయిన ఇద్దరు పాత నేరస్తులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించిన సంఘటన శనివారం రాత్రి జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసులు తెలిపిన ప్రకారం ఎల్లమ్మ బండ చౌరస్తాలోని గుడ్ విల్ హోటల్ సమీపంలో ఇద్దరు పాత నేరస్తులు సమీర్, సుల్తాన్ అనే వ్యక్తులు కరీం అనే వ్యక్తిపై కత్తులతో దాడి చేసి పరారయ్యారు. సమాచారం అందుకున్న జగద్గిరిగుట్ట పోలీసులు వెంటనే స్పందించి సంఘటన జరిగిన కొన్నిగంటల



లోపు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. జగద్గిరిగుట్ట పోలీసుల పనితీరుపై స్థానికులు వర్షం వ్యక్తం చేశారు. జగద్గిరిగుట్ట పోలీస్



స్టేషన్ పరిదిలోని రౌడీ మూకలకు, ఆకతాయిలకు ఇదే హెచ్చరిక ఎవరైనా ప్రజలను భయాందోళనకు గురిచేస్తు, శాంతి బద్రతలకు విగాథం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ వెంకటేశం తెలిపారు.

# మంత్రి మనసు వెన్న.. స్పందన మెరుపు తీగ!

**- ఎడమ కాలు లేని ఓ మహిళకు 'పొంగులేటి' అభయం.. 120 నిమిషాల్లోనే అందిన వీల్ చైర్!**

**- ప్రజా దర్బార్‌లో బాధితురాలికి అండగా నిలిచిన మంత్రి.. క్షేత్రస్థాయిలో సత్వర పరిష్కారం!**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** అధికారం అంటే ఆజ్ఞాపించడం కాదు.. ఆపదలో ఉన్నవారి కన్నీరు తుడవడమేనని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మరోసారి నిరూపించారు. సామాన్యుల సమస్యలను నేరుగా వినేందుకు ఆయన నిర్వహిస్తున్న 'ప్రజా దర్బార్' ఒక నిరుపేద మహిళ జీవితంలో కొత్త వెలుగులు నింపింది. ఎడమ కాలు లేక, కనీసం అడుగు తీసి అడుగు వేయలేని స్థితిలో ఉన్న ఓ బాధితురాలి ఆవేదన చూసి చలించిన మంత్రి.. కేవలం రెండు గంటల వ్యవధిలోనే ఆమెకు ఊతమిచ్చారు.

**- కదిలించిన దీనగాథ**

మండలంలోని గట్టుసింగారం గ్రామానికి చెందిన షేక్ షకీనా అనే మహిళకు ఎడమ కాలు లేదు. నడవలేక, తన పనులు తాను చేసుకోలేక నిత్యం నరకయాతన పడుతున్న



ఆమె, ఆశగా ప్రజా దర్బార్‌కు చేరుకుంది. తన దీనస్థితిని మంత్రి పొంగులేటికి వివరిస్తూ.. "అయ్యా.. నా కాలు లేక బతుకు భారమైంది.. ఒక చక్రాల కుర్చీ ఉంటే ఎవరి మీద ఆధారపడకుండా నా పనులు నేను చేసుకుంటాను" అని వేడుకుంది. ఆ మహిళ ఆర్తిని చూసిన మంత్రి మనసు వెన్నలా కరిగిపోయింది. "అమ్మా.. దిగులు పడకు, నేనున్నాను" అని భరోసా ఇచ్చారు.

**- మెరుపు వేగంతో భరోసా**

మంత్రి ఆదేశం మెరుపు తీగలా పనిచేసింది. విన్నపం అందిన కేవలం 120 నిమిషాల్లోనే అధికారులు కొత్త వీల్ ఛైర్‌ను సిద్ధం చేశారు. జిల్లా కలెక్టర్ సమక్షంలో మంత్రి పొంగులేటి స్వయంగా ఆమె పక్కన నిలబడి, ఆత్మీయంగా పలకరిస్తూ వీల్ ఛైర్‌ను అందజేశారు. సమస్య చెప్పిన కొద్దిసేపటికే పరిష్కారంతో ఆ మహిళ కళ్లలో మెరిసిన ఆనంద బాష్పాలే పొంగులేటి ప్రజా పాలనకు నిదర్శనంగా నిలిచాయి.

**- సర్వత్రా హర్షం**

తక్షణమే స్పందించి తనకు అండగా నిలిచిన మంత్రికి షకీనా మనసారా కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గవ్యాప్తంగా ప్రజా దర్బార్‌లు నిర్వహిస్తూ, ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్తున్న మంత్రి పొంగులేటి తీరుపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున హర్షం వ్యక్తమవుతోంది.

# వర్షంలోనూ భరోసా

**తడిసినా వీడని జనం గదిలో కూర్చుని మంత్రి పొంగులేటి వినతుల స్వీకరణ**

**బచ్చోడు 'ప్రజా దర్బార్'కు అపూర్వ స్పందన**

**అధికారులే ప్రజల వద్దకు రావాలి.. అదే ఈ ప్రభుత్వం లక్ష్యం**

**అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు .. మంత్రి పొంగులేటి**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తిరుమలాయపాలెం లో వాన ధారగా కురుస్తోంది.. బయట ఉంటే తడిసి ముద్దవ్వక తప్పని పరిస్థితి కానీ తమ గోడు వినే 'పెద్దన్న' వచ్చాడని తెలిసి ఆ వానను కూడా ప్రజలు లెక్కచేయలేదు. ప్రజల కష్టాలు తీర్చేందుకు వచ్చిన మంత్రి పొంగులేటి సైతం వర్షానికి వెరవలేదు. సభా ప్రాంగణం తడిసినా స్కూలు గదిని వేదికగా చేసుకుని బాధితుల కన్నీళ్లు తుడిచారు. పాలేరు నియోజకవర్గంలో ఆదివారం సాయంత్రం జరిగిన 'ప్రజా దర్బార్'లో కనిపించిన దృశ్యమిది,?

**చినుకు పడినా.. చిక్కులు విన్నవించిన జనం**

తిరుమలాయపాలెం మండలం బచ్చోడు క్లస్టర్ పరిధిలోని 12 గ్రామ పంచాయతీల ప్రజల కోసం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రజా దర్బార్ నిర్వహించారు. సభ సాగుతున్న తరుణంలో ఒక్కసారిగా వాతావరణం మారి వర్షం కురిసింది. జనం చెల్లాచెదురవుతున్న సమయంలో మంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. వెంటనే పాఠశాలలోని ఒక తరగతి గదిలోకి వెళ్లి అక్కడే బెంచీలపై కూర్చుని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వర్షంలో తడుస్తూ వచ్చిన బాధితులకు నేను ఉన్నాను మీ సమస్యలు త్వరగా పరిష్కరిస్తాం అని అభయమిచ్చారు.

**చెప్పులు అరిగేలా తిరిగే రోజులు పోయాయి!**

?అంతకుముందు సభను ఉద్దేశించి మంత్రి ప్రసంగిస్తూ ప్రజలు తమ సమస్యల కోసం ఆఫీసుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగే పాత పద్ధతులకు స్వస్తి పలకాలి. ప్రభుత్వమే నేరుగా మీ గడప వద్దకు వచ్చి సేవలు అందించాలనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష అందుకే ఈ క్లస్టర్







స్థాయి ప్రజా దర్బార్లను నిర్వహిస్తున్నాంఅని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీ దివాకర రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్ రెడ్డి మండల ఎమ్మార్వో ఎంపీడీవో ఏసీపీ తిరుపతి రెడ్డి మండల ఎస్సై కూచిపూడి జగదీష్ నాగరాజు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బెల్లం శ్రీనివాస్ రామసహాయం అరవింద్ రెడ్డి హరిత రెడ్డి గ్రామ సర్పంచ్ నందిపాటి మల్లికార్జున్ మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు అధికారులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఫ్లెక్సీల చింపివేత పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మున్సిపాలిటీ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ బిఆర్ఎస్ పార్టీ మధ్య ఫ్లెక్సీల రగడ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది.మే 1న జరిగిన శ్రీ బాల నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను బిఆర్ఎస్ నాయకులు చింపివేసారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు చిట్యాల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఫ్లెక్సీలు చించినవారు, వారి వెనకాల ఎవరెవరు ఉన్నారని విషయాలపై పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా నాయకుడు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పందిరి రమేష్, గుండెబోయిన సైదులు,కుక్కల మోహన్, ఏర్పుల పరమేష్, బొబ్బలి రామ్ రెడ్డి,జిట్ట రవి, షేక్ ఇబ్రహీం, కంబంపాటి సతీష్, ఆలయ డైరెక్టర్ ఆగు వెంకన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బాలకృష్ణ కు నివాళులర్పించిన

### సర్పంచుల ఫోరం అధ్యక్షులు కాటం వెంకటేశం

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామానికి చెందిన బొడ్డు బాలకృష్ణ మొన్న జరిగిన నోస్లాబ్ ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి మరణించినారు పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన చిట్యాల సర్పంచుల ఫోరం అధ్యక్షులు కాటం వెంకటేశం మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు అండగా నిలబడడమే ప్రభుత్వం యొక్క లక్ష్యం నిరుపేద కుటుంబానికి చెందిన బాలకృష్ణ కుటుంబానికి ఒక కోటి 50 లక్షల రూపాయలు నకిరేకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ వేముల వీరేశం సహకారంతో ఇప్పించడం జరిగినది. అంతేకాకుండా గాయపడ్డ కార్మికులకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని వారు అన్నారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనరసింహ, చిన్నకాపర్తి గ్రామ సర్పంచ్ ఆవుల సుందర్ , యాదవ్ ,వలిగొండ సత్యనారాయణ ,పల్లపు ప్రశాంత్,రొండి నరసింహ ,మెట్టు వెంకటేశం ,బొడ్డు నరసింహ, బొడ్డు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



# రైతుల పంటను కొనుగోలు చేయలేని చలనం లేని కాంగ్రెస్ ప్రభుత్వం







**జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్న రైతులకు జరిగిన ఉపయోగం శూన్యం**

**కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యవసాయంపై ప్రణాళిక, చిత్తశుద్ధి లేదు**

**రైతులు కదిలితేనే కొనుగోలు కేంద్రాలు వచ్చాయి**

**రైతులు కదిలితేనే కొనుగోలు కేంద్రాల నుంచి బస్తాలు కదులుతాయి**

**తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** రైతుల పంటను కొనుగోలు చేయలేని చెత్త, చేతకాని, దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యవసాయ రంగంపై ఏమాత్రం ప్రణాళిక లేదని, రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు ఘాటుగా విమర్శల వర్షం కురిపించారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండల పరిధిలోని లక్ష్మీపురం, రావినూతల సొసైటీ పరిధిలోనే కొనుగోలు చేసి కల్లాలలో నిల్వ ఉన్న మొక్కజొన్న బస్తాలను, కల్లాలలో ఉన్న మొక్కజొన్నలను ఆదివారం పోతినేని సుదర్శన్ రావు, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, మధిర డివిజన్ కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి కిలారు సురేష్, రైతులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గోవిందాపురం ఎల్, రావినూతల మొక్కజొన్న రైతులు తమ బాధలను వారికి సవివరంగా వివరించారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ మొక్కజొన్నలను కొనుగోలు చేయకుండా తమను కొనుగోలు కేంద్రం అధికారులు, ప్రభుత్వం పెడుతున్న ఇబ్బందులను వారికి వివరించారు. తామే బస్తాలు తెచ్చుకుంటున్నామని చివరికి లారీలు కూడా తామే తెచ్చుకుంటున్నామని రైతులు వారికి వివరించారు.రైతుల సమస్యలను వారు సావధానంగా విన్నారు. ఈ సందర్భంగా పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ రైతుల పోరాట ఫలితంగానే బోనకల్ మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారన్నారు. కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు ఎంతో ఆర్భాటంగా ప్రారంభించి ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ప్రకటించారన్నారు. కానీ మొక్కజొన్నలను కొనుగోలు చేయకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఘాటుగా విమర్శలు వర్షం కురిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ బాధ్యత నుంచి తప్పుకొని రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని విమర్శించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నియోజకవర్గం లో మొక్కజొన్న రైతుల పరిస్థితి ఈ విధంగా ఉండటంతో ప్రతి రైతు కన్నీరు పెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మిగతా నియోజకవర్గాలలో పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అర్థమవుతుందన్నారు. రైతులే బస్తాలు కొనుగోలు చేసుకుని తెచ్చుకుంటున్నారని, చివరకు లారీలను కూడా రైతులే కిరాయి చెల్లించి తెచ్చుకునే దుస్థితి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏర్పడిందని విమర్శించారు. లారీ డ్రైవర్ బస్తా కి రూ. 40 రూపాయలు వసూలు చేస్తున్నా ఈ ప్రభుత్వానికి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు కళ్ళు లేవా? ఉంటే ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. మాట్లాడితే



ముఖ్యమంత్రి ఫీచర్ సిటీ అంటున్నారని, రైతుల గురించి పట్టించుకోవటం లేదని విమర్శించారు. ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ఊక దంపుడు ఉపన్యాసాలు చేసిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఎక్కడ ఉన్నారని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రభుత్వంలో రైతులకు అన్నీ కష్టాలనే ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బోనకల్ మండలంలో కొనుగోలు కేంద్రాల పరిధిలో కల్లాలలో వేలాది బస్తాలు, మొక్కజొన్నలు ఉన్నాయన్నారు. ఒకవైపు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తుంటే రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, అయినా ప్రభుత్వం చలించకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో యూరియా కొరత, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల కొరత, మొక్కజొన్నల కొనుగోళ్ళు పై పరిమితి విధిస్తూ రైతులను ఆర్థికంగా తీవ్రంగా నష్టపరుస్తుందని విమర్శించారు. ఆరు గాలం అనేక కష్టాలు పడి పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధి తెలియజేస్తుందన్నారు. గోడౌన్ల సౌకర్యం కల్పించవలసిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదా అని ఆయన ప్రశ్నించారు. రైతులను ఇబ్బందులకు గురిచేసిన ప్రభుత్వాలకు గతంలో ఏ గతి పట్టిందో కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా భవిష్యత్తులో అదే గతి పడుతుందని ఆయన హెచ్చరించారు. రోజు రోజుకి వాతావరణంలో వస్తున్న మార్పులకు అన్నదాతలు తీవ్ర ఆందోళన ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, అయినా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. డిప్యూటీ సీఎం, వ్యవసాయ శాఖ మంత్రి, రెవిన్యూ శాఖ మంత్రి జిల్లాలో ఉన్నప్పటికీ రైతులకు జరిగిన ఉపయోగం మాత్రం శూన్యం అన్నారు.రైతులందరూ కదిలితేనే బోనకల్ మండలానికి మొక్కజొన్న కనుగోల కేంద్రాలు మంజూరయ్యాయని, మరల రైతులు కదిలితేనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల నుంచి కొనుగోలు చేసిన మొక్కజొన్న బస్తాలు కదులుతాయని, రైతుల పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. వారి వెంట గోవిందాపురం ఎల్ సర్పంచ్ మంద కరుణ, మాజీ సర్పంచ్ కొమ్ము కమలమ్మ, రైతులు మాదినేని వీరభద్రరావు, జొన్నలగడ్డ సునీత, ఏడునూతల లక్ష్మణరావు, దొండపాటి సత్యనారాయణ, జోనిబోయిన గురవయ్య, ఎర్రగాని నాగరాజు, షేక్ నన్నేసాహెబ్, గుగులోత్ నరేష్, గుడ్దూరి ఉమ, గుడ్డురి వెంకట నరసయ్య రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రీడలో మానసిక ఉల్లాసానికి శారీరక దృఢత్వానికి ద్రోహద పడతాయి

## కోదాడలో జర్నలిస్టుల క్రికెట్ మ్యాచ్



**కోదాడ,మే 03 ( క్రైమ్ మిర్రర్ )** క్రీడలు మానసిక ఉల్లాసానికి శారీరక దృఢత్వానికి ఎంతో ద్రోహదపడతాయని పలువురు తెలిపారు. ఆదివారం ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా కోదాడ జర్నలిస్టులు స్థానిక కటకొమ్మ గూడెం రోడ్డు బైపాస్ గ్రౌండ్ లో క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జర్నలిస్టులు నిత్యం వార్తా విధుల్లో నిమగ్నమయి వారి ఆరోగ్యాలను కూడా లెక్కచేయకుండా ఉంటారు. అలాంటి వారికి క్రీడా పోటీలు ఏర్పాటు చేసి వారిని ప్రోత్సహించినట్లయితే ఈ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసాన్ని పొందుతారని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు జర్నలిస్టుల మధ్య ఐక్యతను, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో మాతంగి సురేష్, జూలూరి బసవయ్య, శ్రీకాంత్, శ్రీహరి, చరణ్, శ్రీనివాస్, మణికంఠ, కృష్ణ, వాసు తదితరులు పాల్గొన్నారు.